క్లుప్తంగా

శిథిల ఇళ్ల కూల్చివేత



బాన్సువాడ రూరల్: కురుస్తున్న భారీ వర్షాలకు నిర్వాహణ లేక శిథిలావస్థకు చేరిన ఇళ్లను పొక్లెయినర్‌తో తొలగించి నేలమట్టం చేయిస్తున్నట్లు బోర్లం పంచాయతీ కార్యదర్శి సాయికుమార్ తెలిపారు. శనివారం మండలంలోని వడ్ల కమ్మరుల కాలనీలో పూర్తి శిథిలావస్థకు చేరిన ఇంటిని నేలమట్టం చేయించారు. గ్రామంలో పురాతన ఇళ్ల యజమానులకు నోటీసులు ఇచ్చామన్నారు.

త్రీఫేజ్ విద్యుత్ పునరుద్ధరణకు సత్వర చర్యలు



ఎల్లారెడ్డిరూరల్: గ్రామాలలో త్రీఫేజ్ విద్యుత్ పునరుద్ధరణకు సత్వర చర్యలను తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ డీఈ విజయసారథి అన్నారు. శనివారం ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్, తిమ్మారెడ్డి, అన్నాసాగర్ తాండాలలో వరద బీభత్సానికి విరిగి పోయిన విద్యుత్‌స్తంభాలు, డీటీఆర్‌లను ఆయన పరిశీలించారు. ఎల్లారెడ్డి డీఈ పరిధిలో ప్రతి గ్రామంలో సింగిల్ ఫేజ్ సప్లై ప్రారంభమైందని అన్నారు. త్రీఫేజ్ సైతం 80 శాతం పనులు పూర్తి కావడం జరిగిందన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన త్రీఫేజ్ పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ వెంకటస్వామి, లైన్‌మెన్ బాలకిషన్ తదితరులున్నారు.

ఇళ్లకు చేరుకున్న ముంపు బాధితులు




నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ప్రాజెక్టు వరద నీటి ప్రవాహం నేపథ్యంలో ముందు జాగ్రత్తగా పునరా వాస కేంద్రాలకు తరలి వెళ్లిన బాధితులు శనివారం సొంత గ్రామానికి, ఇళ్లకు చేరుకున్నారు. మండలంలోని మర్పల్లి గ్రామంలోని 60 కుటుంబాలను అధికారులు ఇళ్లను ఖాళీ చేయించారు. గోర్గల్ గేటు వద్ద ఉన్న ఫంక్షన్ హాల్ లో పునరావాసం ఏర్పాటు చేసి సకల సదుపాయాలు కల్పించారు. వరద ప్రవాహం తగ్గడంతో మండల తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో గంగాధర్ బాధితులను సురక్షితంగా ఇళ్లకు చేర్చారు.

ఇసన్నపల్లిలో తెగిపోయిన కొత్త చెరువు అలుగు కాలువ



భిక్కనూరు: మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో శనివారం కొత్త చెరువు అలుగు కాలువ తెగిపోయింది. దీంతో చెరువులోని నీరు బయటకు వస్తోంది. గమనించిన గ్రామస్తులు రెవెన్యూ, నీటి పారుదలశాఖ అధికారులకు సమాచారం అందించారు.

కోతకు గురైన రోడ్డు పనులు ప్రారంభం



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని గండిమాసానిపేట శివారులో కోతకు గురైన ఎల్లారెడ్డి- కామారెడ్డి రోడ్డు పనులను శనివారం ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రారంభించారు. మండలంలోని అడివిలింగాల, కొట్టాల్ వద్ద కోతకు గురైన రోడ్డు పనులు త్వరిత గతిన పూర్తి చేయడం జరుగుతుందని డీఈ నారాయణ అన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఏఈ ఐశ్వర్య, తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిబాబా, కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

పనులు యుద్ధప్రాతిపదికన చేయాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): వర్షాలకు తెగిపోయిన లింగంపేట మండలం లింగంపల్లి(ఖుర్దు) గ్రామం వద్ద గల పాముల వాగు వంతెన తాత్కాలిక మరమ్మతు పనులను శనివారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. ఎల్లారెడ్డి, కామారెడ్డి ప్రధాన రోడ్డులో ఉన్న ఈ వంతెన తెగిపోవడంతో గత మూడు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో రవాణా సౌకర్యాలు పునరుద్ధరించడానికి ఆర్ అండ్‌బి శాఖ ఆధ్వర్యంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. సదరు పనులను పరిశీలించారు. ఆర్అండ్‌బి డీఈ మోహన్, అధికారులతో మాట్లాడారు. దెబ్బతిన్న ఇళ్లు, నష్టపోయిన పంటల వివరాలు సేకరించి అందజేయాలని ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో నరేష్ ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

కూలిన ఇళ్లకు ఆర్థిక సాయం



బాన్సువాడలో వర్షాలకు కూలిన ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి



కామారెడ్డిలో బాధితుల వివరాలు సేకరిస్తున్న రెవెన్యూ అధికారులు



రాజంపేటలో భోజనం అందిస్తున్న సింగిల్ విండో చైర్మన్ నల్లవెల్లి అశోక్

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- బాధితుల వివరాలు సేకరిస్తున్న అధికారులు

బాన్సువాడ : ఇటీవల కురిసిన ఇళ్లకు ఆర్థిక సాయం అందించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. శనివారం బాన్సువాడలో కూలిపోయిన ఇళ్లను సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి ఆయన పరిశీలించారు. పట్టణంలో ఏఏ కాలనీలో వర్షాలకు ఇళ్లు దెబ్బతిన్నాయనే వివరాలు తెలుసుకున్నారు. పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్ల యజమానులకు ఒక్కొక్కరికి రూ.4 వేలు చొప్పున వెంటనే సాయం అందించాలని అన్నారు. అధికారులు సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు తదితరులు ఉన్నారు.

రూ.11,500 ఆర్థిక సహాయం

కామారెడ్డి అర్బన్: వరదలతో నష్టపోయిన కామారెడ్డి జీఆర్ కాలనీ, హౌసింగ్‌బోర్డు కౌండిన్య ఎన్‌క్లేవ్ బాధితులకు ప్రభుత్వ పరంగా తక్షణ ఆర్థిక సహాయం అందజేయడానికి శనివారం రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి పర్యటన చేశారు. బాధితుల నుంచి ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలను తీసుకున్నారు. ఒక్కో కుటుంబానికి రూ.11,500లు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని తహసీల్దార్ జనార్దన్ చెప్పారు. జీఆర్ కాలనీలో 48, కౌండిన్య ఎన్‌క్లేవ్‌లో 20 ఇళ్లు వరదలకు నష్టపోయినట్టు తహసీల్దార్ పేర్కొన్నారు. కామారెడ్డి వరద బాధితులకు కామారెడ్డి న్యాయవాదుల సంఘం తరఫున దుప్పట్లు, బెడ్‌షీట్లు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టుల ప్రభుత్వ న్యాయవాది కే.శ్యాంగోపాల్‌రావు, వెంకటరాంరెడ్డి, జి.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లోని కుటుంబాలకు భోజనం

రాజంపేట : గ్రామ పంచాయితీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పునరావాసం పొందుతున్న రాజంపేట గ్రామానికి చెందిన 42 మందికి రాజంపేట సొసైటీ సింగిల్ విండో చైర్మన్ నల్లవెల్లి అశోక్ శనివారం భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్ , డైరెక్టర్లు బాలయ్య, కట్లకుంట సిద్దిరాములు, రాజిరెడ్డి, పిట్ల స్వామి, భూస సింహం గ్రామ పంచాయితీ సిబ్బంది గంగాధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్ నగర్ మండలంలో..

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని బొగ్గుగుడిసె చౌరస్తా, తుంకిపల్లి గ్రామంలోని వరద ముంపు బాధితులకు శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిన్నరాజులు, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ చేతుల మీదుగా నిత్యావసరాల సరుకులను అందజేశారు. వర్షాలతో ముంపునకు గురైన బాధితులకు స్థానిక బీజేపీ నాయకుడు కొండ అనిల్‌గుప్తా నిత్యావసర సరుకులతో పాటు ఒక్కొక్క కుటుంబానికి 25 కిలోల బియ్యం బస్తాను విరాళంగా ఇచ్చారు. అనంతరం ముంపునకు గురైన ఇళ్లతో పాటు పంటనష్టానికి గురైన పొలాలను వారు పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యేలు అరుణాతార, గంగారాం బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ నాయకులు శంకర్,రాజు, రవీందర్‌గౌడ్, విఠల్, పండరి, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

భిక్కనూరు మండలంలో కూలిన 61 ఇళ్లు

భిక్కనూరు: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు 61 ఇళ్లు కూలినట్లు భిక్కనూరు తహసీల్దార్ సునీతదేవి శుక్రవారం తెలిపారు. రెవెన్యూ సిబ్బంది అన్ని గ్రామల్లో పర్యటించి కూలిన ఇళ్ల వివరాలను సేకరిస్తున్నారన్నారు. మండల కేంద్రంలోని దళిత వాడల్లో నివసిస్తున్న నిరుపేదలకు యువజన కాంగ్రెస్ నాయకుడు విజయ్‌కుమార్‌గౌడ్ నిత్యావసర వస్తువులను పాల, బ్రెడ్ ప్యాకెట్లను బాధితులకు పంపిణీ చేశారు.



తుంకిపల్లిలో సరుకులను అందిస్తున్న బీజేపీ నేతలు



భిక్కనూరులో సరుకులను పంపిణీ చేస్తున్న విజయ్‌కుమార్ గౌడ్

కూలిన ఇళ్లను త్వరగా గుర్తించాలి



తాడ్వాయిలో చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): వర్షాలతో దెబ్బతిన్న ఇళ్లను త్వరగా గుర్తించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం తాడ్వాయిలో కూలిన ఇళ్లను పరిశీలించి తక్షణ సాయంకింద రూ.5 వేలు అందించాలన్నారు. ఈ సందర్భంగా వర్షాలకు కూలిన గైని సురేష్ ఇల్లును పరిశీలించారు. కూలిన ఇండ్లకు తప్పనిసరిగా ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందన్నారు. గ్రామాలలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలను అందించాలన్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పంటలను కూడా పరిశీలించి పూర్తి వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో ఆడుకుంటున్న పిల్లలతో ముచ్చటించారు.కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శివకుమార్, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ, ఎంపీవో సవిత, ఏఈఈ కల్పన, ఆర్ఐ హరిక, ఏవో నర్సింలు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.లక్ష పరిహారం చెల్లించాలి : జాజాల



నాగిరెడ్డిపేటలో పంటలను పరిశీలిస్తున్న జాజాల

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.లక్ష చొప్పున పరిహారం చెల్లించాలని ఎల్లారెడ్డి మాజీఎమ్మెల్యే జాజాల సురేందర్ డిమాండ్ చేశారు. నాగిరెడ్డిపేట మండలం బంజార, నాగిరెడ్డిపేట, చీనూర్, వాడి గ్రామాల సమీపంలో వరదనీటిలో ముంపునకు గురైన పంటలను శనివారం ఆయన పరిశీలించారు. మండలంలోని మెల్లకుంటతండాలో వర్షాలతో కూలిన ఇంటిని అయన పరిశీలించారు. అనంతరం పోచారంప్రాజెక్టు వద్దనున్న గంగమ్మతల్లికి కొబ్బరికాయ కొట్టి ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జిల్లాలో కురిసిన భారీవర్షాలకు ఎల్లారెడ్డి నియోజకవర్గానికి భారీనష్టం వాటిల్లిందన్నారు. వేల ఎకరాల్లో పంటలు నీటమునిగి రైతులకు తీవ్రనష్టం వాటిల్లిందని ఆయన చెప్పారు.బాధితులను ప్రభుత్వం ఆదుకోకపోతే రైతులందరినీ ఏకం చేసి రోడ్లపై ఆందోళనలు చేపడతామన్నారు.గంగమ్మతల్లే పోచారంప్రాజెక్టును కాపాడిందని ఆయన చెప్పారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సిద్ధయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి, మాల్తుమ్మెద సొసైటీ చైర్మన్ నర్సింలు, డైరెక్టర్ వంశీగౌడ్, నాయకులు శ్రీనివాస్, మంగలి యాదగిరి, రాజిరెడ్డి, పరిశోధన్ రెడ్డి తదితరులున్నారు.

పంటలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యేలు

ఎల్లారెడ్డి: వరదల నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని జాజాల సురేందర్ అన్నారు. ఎల్లారెడ్డి మండలంలోని ఆజామాబాద్, అన్నాసాగర్, తిమ్మారెడ్డి గ్రామ శివారులలో పంటలను సురేందర్ పరిశీలించారు. అదే సమయంలో అటువైపుగా వెళ్తున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌సింధేతో కలిసి సురేందర్ పంటలను పరిశీలించారు. అనంతరం సురేందర్ మాట్లాడుతూ వరదలతో రైతులకు తీరని నష్టం జరిగిందన్నారు. నాయకులు నర్సింలు, సాయిలు, సురేందర్, జలంధర్‌రెడ్డి, సతీష్, అరవింద్, పృథ్వీరాజ్, రాజు, కపిల్‌రెడ్డి, సాయిలు తదితరులున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే



బొగ్గుగుడిసె చౌరస్తా వద్ద వరద బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సింధే

నిజాంసాగర్(జుక్కల్): వర్షం కారణంగా సర్వం కోల్పోయిన బాధితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే డిమాండ్ చేశారు. శనివారం మహమ్మద్ నగర్ మండలంలోని బొగ్గు గుడిసె చౌరస్తా వద్ద వరద ముంపుకు గురైన ఇళ్లు, కొట్టుకుపోయిన దుకాణాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల ఎకరాల్లో పంటలు నష్టానికి గురయ్యాయన్నారు.మాజీ జెడ్పీచైర్మన్ దఫేదార్ రాజు, నాయకులు సాదుల సత్యనారాయణ, వాజీద్ అలీ, రాంచెందర్, లక్ష్మీనారాయణ, బంజార నాయకుడు శ్రీనివాస్ తదితరులున్నారు.

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి : బీబీ పాటిల్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఇళ్లు కూలిపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీ బీబీ పాటిల్ పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండలం పోచారంప్రాజెక్టు వద్ద జరుగుతున్న తాత్కాలిక మరమ్మతు పనులను మండల బీజేపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ప్రాజెక్టు వద్ద చేపడుతున్న మరమ్మతు పనుల వివరాలను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోచారం ప్రాజెక్టు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఆయన సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారీవర్షాల కారణంగా నాగిరెడ్డిపేట మండలంలోని పోచారంప్రాజెక్టు అలుగుకు ఒక వైపు మట్టి కొట్టుకుపోయి కోతకు గురైందన్నారు. ఈ మేరకు అధికారులు ప్రాజెక్టు అలుగుకు అనుకొని ఉన్న సపోర్ట్‌వాల్ దెబ్బతిన్నకుండా మొరంవేసి తాత్కాలిక చర్యలు చేపట్టారని ఆయన చెప్పారు. అనంతరం జిల్లా సరిహద్దులో ధ్వంసమైన జాతీయ రహదారిని పరిశీలించారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజ్‌మోహన్‌రెడ్డి, హన్మాండ్లు, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు శ్రీకాంత్, దేవిసింగ్, భాస్కర్ తదితరులున్నారు.

కొత్త ఇళ్లు మంజూరు చేయాలి



ఎల్లారెడ్డిలో వర్షానికి కూలిన ఇంటిని పరిశీలిస్తున్న మాజీ ఎంపీ బీబీ పాటిల్

ఎల్లారెడ్డి: వర్షాలతో కూలిన ఇళ్ల బాధితులకు కొత్త ఇళ్లను మంజూరు చేయాలని జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డిలో భారీ వర్షాల కారణంగా ఇళ్లు కూలిన బాధితులతో పాటు మండలంలోని పలు గ్రామాలలో వరదల ధాటికి పంట నష్టం జరిగిన రైతులను ఆయన పరామర్శించారు. బీజేపీ నాయకులు రాములు, నర్సింలు, రాజేష్ తదితరులున్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



చౌదరి చెరువును పరిశీలిస్తున్న నాయకులు

లింగంపేట(ఎల్లారెడ్డి): వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం అయన పొల్కంపేట చౌదరి చెరువును పరిశీలించి మాట్లాడారు. వరద నీటికి చెరువు కట్ట తెగిపోవడంతో ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వెంటనే శాశ్వత మరమ్మతులు చేపట్టాలన్నారు. కట్ట తెగిపోవడంతో చెరువులోని నీరు ఖాళీ అయిందన్నారు. రైతులకు ఎకరాకు రూ. 20వేలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. అలాగే పాముల వాగు వంతెనను రూ. 3 కోట్లతో శాశ్వతంగా ఉండేలా నిర్మించాలని డిమాండు చేశారు. నర్సింలు, మోహన్, రైతులు, గ్రామస్తులు ఉన్నారు.వర్షానికి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. కన్నాపూర్ గ్రామ శివారులోని చౌదరి చెరువు కట్ట తెగిపోయిన ప్రాంతాన్ని పరిశీలించి ఆయన మాట్లాడారు.గ్రామంలో 15 ఇళ్లు కూలిపోయాయని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. గ్రామానికి వెళ్లే రోడ్డు ధ్వంసమై రాకపోకలు నిలిచిపోయాయన్నారు.టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, విఠల్, కాశీరాం, వెంకట్, రైతులు, గ్రామస్తులు ఉన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం : ఎంపీ సురేష్ షెట్కార్



మద్నూర్‌లో బాధితులతో మాట్లాడుతున్న ఎంపీ

మద్నూర్(జుక్కల్): వరదలతో అన్ని కోల్పోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ అన్నారు. మద్నూర్, డోంగ్లీలో వరద బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను శనివారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఎవరు ఆందోళన చెందవద్దని కోరారు. మాజీ జెడ్పీటీసీ సాహెబ్‌రావ్, నాయకులు, కార్యకర్తలున్నారు.

రూ. 10 లక్షల నష్ట పరిహారం అందించాలి



బాధితులతో మాట్లాడుతున్న నాయకులు

కామారెడ్డి టౌన్: పట్టణంలో వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక నాయకులతో కలిసి జీఆర్ కాలనీలో పర్యటించి బాధితులతో మాట్లాడారు. నష్టపోయిన కుటుంబాలకు రూ. 10లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రోడ్లు, కాలువల మరమ్మతులు, కాలనీలో శుభ్రత పనులు శరవేగంగా పనులను పూర్తి చేయాలని కోరారు. నాయకులు దేవరాం, రమేష్,ప్రకాష్, సురేష్ తదితరులున్నారు.

వరద బాధితుల అవస్థలు



కోమట్‌పల్లిలో తడిసిన ధాన్యం ఆరబెట్టుకుంటున్న కాలనీ వాసులు



సరుకులు శుభ్రం చేసుకుంటున్న మహిళలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కోమట్‌పల్లి, లింగంపేట, కన్నాపూర్, లింగంపల్లి, అయిలాపూర్, కేశాయిపేట, భవానిపేట, శెట్పల్లి, శెట్పల్లి సంగారెడ్డి, సురియిపల్లి, తదితర గ్రామాల్లో వరద నీరు ఇళ్లలోకి వచ్చి చేరింది. కోమట్‌పల్లికి చెందిన చిటూరి అల్లూరి, లింగం, భిక్షపతి, పోచయ్య, చాకలి రామవ్వ, నీరడి దేవవ్వ, బాల్‌రాజు, గోపాల్, చీటూరి రమేశ్, భూమవ్వతో పాటు పలు ఇళ్లలోకి వరద నీరు రావడంతో పలు కుటుంబాలు ఇల్లు విడిచిపెట్టి బంధువులు, పరిచయస్తుల ఇళ్లకు వెళ్లారు. శనివారం తిరిగి ఇళ్లకు చేరుకున్నారు. ఇళ్లలో పేరుకుపోయిన నీరు, బురదను తొలగించుకోవడానికి ఇబ్బందులు పడ్డారు. తడిసిన బియ్యం, గోధుమలు, వడ్లు, మక్కలు, పప్పు దినుసులు ఇళ్ల ముందు వాకిళ్లలో ఆరబెట్టారు. కన్నాపూర్‌లో పాక్షికంగా ఇళ్లు దెబ్బతిన్న బాధితులు ప్రభుత్వం తమకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

రాకపోకలను పునరుద్ధరించేదెప్పుడో



లింబుర్-సిర్‌పూర్ రోడ్డు దుస్థితి

- ఉమ్మడి మద్నూర్ మండలంలో కొట్టుకుపోయిన రహదారులు
- చర్యలు చేపట్టాలని గ్రామస్తుల వినతి

మద్నూర్(జుక్కల్): గత నాలుగు రోజులుగా వరద బాధితులు కష్టాలు పడుతున్నారు. ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులు వరదల కారణంగా కోతలకు గురికావడంతో ఇక్కడి వారు అక్కడకి అక్కడి వారు ఇక్కడి రాలేకపోతున్నారు. డోంగ్లీ మండలంలోని సిర్‌పూర్, చిన్న టాక్లీ, పెద్ద టాక్లీ, లింబుర్ వాడి, మద్నూర్ మండలంలోని గోజేగావ్, రాచూర్ గ్రామస్తులు ప్రధాన రహదారి కోతకు గురికావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద నీరు తగ్గుముఖం పట్టిన అధికారులు చర్యలు ఎందుకు చేపట్టడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిర్‌పూర్ నుంచి పోతంగల్ రహదారిపై భారీ గుంత పడడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. సిర్‌పూర్ గ్రామ శివారులోని విద్యుత్ సబ్ స్టేషన్ పూర్తిగా నీట మునిగిన దృశ్యాలను ట్రాన్స్‌కో అధికారులు శనివారం డ్రోన్ ద్వారా చిత్రీకరించారు. మద్నూర్, డోంగ్లీ మండలాల శివారుల్లోని సోయాబీన్, వరి పంట పూర్తిగా దెబ్బతిందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



కొట్టుకుపోయిన చిన్న టాక్లీ-లింబుర్ రోడ్డు



సిర్‌పూర్ శివారులో నీటిలో మునిగిన సబ్‌స్టేషన్

తేరుకుంటున్న కాలనీలు





హౌసింగ్‌బోర్డు కాలనీలో తడిసిన సామగ్రి బయట ఉంచిన బాధితులు, జీఆర్ కాలనీలో..

రెండు రోజుల పాటు కురిసిన భారీ వర్షానికి కామారెడ్డి పట్టణం చిగురుటాకులా వణికింది.లోతట్టు కాలనీలు వరద ప్రవహానికి జలమయమయ్యాయి. పలు కాలనీల్లో రోడ్లన్నీ జలమయవడంతో పాటు ఇళ్లలోకి నీరు చేరాయి. వర్షం తగ్గడంతో ఇప్పుడిప్పుడే కాలనీలు తేరుకుంటున్నాయి.

– కామారెడ్డి టౌన్



హౌసింగ్ బోర్డు కాలనీ మైసమ్మ ఆలయంలో శుభ్రం చేస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు



బతుకమ్మ కుంటలో ధ్వంసమైన రోడ్డు

పింఛన్ కోసం వరదలో నుంచి నడక



వరదలో నుంచే నడుస్తున్న తండావాసులు

పిట్లం(జుక్కల్): మండలంలోని కిష్టాపూర్ నుంచి చిన్నకొడప్గల్ గ్రామానికి వెళ్లే దారిలో వంతెన కొట్టుకుపోయింది. దీంతో బ్రాహ్మణపల్లి, కిష్టాపూర్ తండాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పింఛన్ కోసం బ్రాహ్మణపల్లి, కిష్టాపూర్ తండావాసులు శనివారం చిన్నకొడప్గల్ గ్రామానికి వరద నీటిలో నడుచుకుంటూ వెళ్లారు.

నాలాల ఆక్రమణతో వరద కష్టాలు



మాట్లాడుతున్న బాలు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని నాలాల ఆక్రమణలతోనే ప్రజలకు వరద కష్టాలు వచ్చాయని ఇంటర్నేషనల్ వైశ్య ఫేడరేషన్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ బాలు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ రోడ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నిజాంసాగర్ చౌరస్తా నుంచి జీవదాన్ పాఠశాలకు వెళ్లే దారిలో గల 40 ఫీట్ల పొడవైన నాలాను ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మించడంతో ఇళ్లలోకి వరద చేరిందన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్, రాష్ట్ర మున్సిపల్ అధికారులు విచారణ జరిపి నిజాంసాగర్ రోడ్ నుంచి కామారెడ్డి చెరువు వరకు నాలాను నిర్మించాలని డిమాండ్ చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
బాన్సువాడ: యం. మధుసూధన్ : 9951027699
ఎల్లారెడ్డి: ఎం. శ్రీనివాస్ : 9704490298
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899